క్లుప్తంగా

బ్యాంకు ఖాతాలో సొమ్ము పోయిందంటూ ఫిర్యాదు

రావులపాలెం: తన బ్యాంకు ఖాతాలో తనకు తెలియకుండా యాభై వేలు విత్ డ్రా అయినట్టు రావులపాలేనికి చెందిన ఒక వ్యక్తి పోలీసులకు, బ్యాంకు అధికారులకు ఫిర్యాదు చేశాడు. సోమవారం ఈ వివరాలను ఫిర్యాదుదారుడు మీడియాకు వివరించాడు. ఇటీవల రావులపాలెంలో పలువురి అకౌంట్ల నుంచి నగదు విత్ డ్రా అయిన సంఘటన మరువక ముందే మరో సైబర్ క్రైమ్ చోటుచేసుకుంది. రావులపాలెంకు చెందిన కొవ్వూరి సతీష్ రెడ్డికి స్థానిక ఎస్‌బీఐ బ్రాంచ్‌లో ఖాతా ఉంది. 2013లో ఈ ఖాతా ఓపెన్ చేసినట్టు తెలిపాడు. గత నెల 27న తన ఖాతా నుంచి రూ.50 వేలు వేరొక అకౌంట్‌కి నెఫ్ట్ విధానంలో ట్రాన్స్‌ఫర్ అయినట్టు మెసేజ్ రావడంతో చూసి బ్యాంక్ అధికారులకు ఫిర్యాదు చేసినా అధికారులు స్పందించకపోవడంతో రావులపాలెం పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై సైబర్ క్రైమ్‌లో కేసు నమోదు చేయించి సదరు అకౌంట్‌కు చెందిన వివరాలతో నగదు రికవరీ చేసేందుకు చర్యలు తీసుకోవాలంటూ రావులపాలెం సీఐ ఎం.ఆంజనేయులు బ్యాంక్ అధికారులకు లేఖ రాసినట్లు బాధితుడు తెలిపారు.

ఖాతాదారులకు మెరుగైన సేవలు

మలికిపురం: ఖాతాదారులకు మెరుగైన సేవలు అందించడమే లక్ష్యంగా స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా పని చేస్తుందని ఆ బ్యాంకు ఏజీఎం ఏఆర్ రెహమాన్ పేర్కొన్నారు. సోమవారం లక్కవరం స్టేట్ బ్యాంకుకు ఇన్స్‌పెక్షన్‌కు వచ్చిన ఆయనకు స్థానిక బ్రాంచ్ సిబ్బంది పుష్పగుచ్ఛం అందించి శాలువాతో సత్కరించారు. ఆయన మాట్లాడుతూ చక్కని టర్నోవర్‌తో బ్రాంచ్ పురోభివృద్ధిలో ఉందన్నారు. లక్కవరం చాంబర్ కామర్స్ అధ్యక్షుడు రుద్రరాజు గోపాలకృష్ణంరాజు రెహమాన్‌కు శాలువా వేసి సత్కరించినారు. బ్రాంచ్ మేనేజర్ దామోదర రామప్రసాద్, అకౌంటెంట్ కె.ఫణి సూర్యకుమార్, క్యాష్ ఇంచార్జ్ ఒ.రాంబాబు, అసోసియేట్ ఎ.వెంకటేష్ పాల్గొన్నారు.

మానసికోల్లాసానికి క్రీడలు దోహదం

అంబాజీపేట: ప్రస్తుత వాతావరణంలో క్రీడలు మానసికోల్లాసానికి దోహదపడతాయని ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు, వైఎస్సార్ సీపీ జిల్లా ప్రచార విభాగం అధ్యక్షుడు దొమ్మేటి సత్యమోహన్, మండల శాఖ అధ్యక్షుడు విత్తనాల ఇంద్రశేఖర్, ఎంపీటీసీ మట్టా పార్వతి అన్నారు. మాచవరంలో గత ఐదు రోజులుగా కుసుమ బ్రదర్స్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కుసుమ కృష్ణమూర్తి క్రికెట్ మెమోరియల్ టోర్నమెంట్ సోమవారంతో ముగిసింది. ఈ టోర్నీలో అంబేడ్కర్ నగర్ విన్నర్స్‌గాను, భరత్ నగర్ రన్నర్స్‌గా నిలిచినట్లు నిర్వాహకులు తెలిపారు. అనంతరం విన్నర్స్, రన్నర్స్‌కు ట్రోఫీలు అందించారు.

నిత్యాన్నదానానికి రూ.20,232 విరాళం

అయినవిల్లి: అయినవిల్లి విఘ్నేశ్వరస్వామివారి ఆలయంలో అమలు చేస్తున్న నిత్యాన్నదాన పథకానికి హైదరాబాద్‌కు చెందిన జ్యోతిష్యుడు నూకల సూర్యనారాయణమూర్తి భార్య గంటి స్వర్ణలత పేరున సోమవారం రూ.20,232 విరాళం అందజేశారు. ఈ సొమ్మును ఆలయ ఈఓ ముదునూరి సత్యనారాయణరాజుకు అందజేశారు. దాతను వేద మంత్రాలతో సత్కరించి స్వామి చిత్రపటం, ప్రసాదం అందజేశారు. దాతను ఆలయ సిబ్బంది, అర్చక సిబ్బంది అభినందించారు.

నేడు, రేపు హోం ఓటింగ్

కొత్తపేట: హోం ఓటింగ్ విధానం మంగళవారం, బుధవారం అమలు చేసేందుకు చర్యలు తీసుకున్నట్టు ఆర్డీఓ, నియోజకవర్గ ఎన్నికల అధికారి జీవీవీ సత్యనారాయణ తెలిపారు. నియోజకవర్గంలో 85 సంవత్సరాలు పైబడి పీఎస్‌కు రాలేని వయో వృద్ధులు 23, దివ్యాంగులు 39 మందిని గుర్తించారు. వారు ఓటు సద్వినియోగం చేసుకునేందుకు ఎన్నికల సిబ్బందే వారి వద్దకు వెళ్లి ఓటు ఇస్తారని ఆర్ఓ సత్యనారాయణ తెలిపారు. నియోజకవర్గంలో పోస్టల్ బ్యాలెట్ ఓటర్లుగా ఉన్న పీఓలు, ఏపీఓలు, ఓపీఓలు 1532 మంది పోలీస్, మెడికల్, ఆర్టీసీ, మైక్రో అబ్జర్వర్స్ 103 మంది కాగా ఈ నియోజకవర్గం నుంచి ఇతర నియోజకవర్గాల్లో ఎన్నికల విధులు నిర్వహిస్తున్న వారు 419 మంది ఉన్నారన్నారు. వారు ఆయా నియోజకవర్గాల్లో పోస్టల్ బ్యాలెట్ ఓటు వినియోగించుకునే అవకాశం కల్పించామన్నారు.

జేసీఎస్ ఇన్‌చార్జి-2ల నియామకం

మలికిపురం: జేసీఎస్ రాష్ట్ర కోఆర్డినేటర్ పుత్తా ప్రతాప్ రెడ్డి, నియోజకవర్గ వైఎస్సార్ సీపీ అభ్యర్థి గొల్లపల్లి సూర్యారావు అనుమతితో 'జగన్ కోసం సిద్ధం' కోసం రాజోలు నియోజకవర్గంలో మూడు మండలాలకు జేసీఎస్ మండల ఇంచార్జ్ 2 లను నియమించినట్లు జిల్లా జేసీఎస్ కోఆర్డినేటర్ పాటి శివకుమార్ సోమవారం తెలిపారు. మలికిపురంలోని పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఈ మేరకు ఆయన ప్రకటించారు. సఖినేటిపల్లి మండలానికి తాడి సహదేవ్ (వీవీ మెరక), మలికిపురం మండలానికి తోటె రాజేష్ (చింతలమోరి), రాజోలు మండలానికి నమవరపు హనుమంతురావు(తాటిపాక)లను నియమించామన్నారు. వీరు మండలంలో మండల పార్టీ అధ్యక్షులు, మిగిలిన జేసీఎస్ ఇన్‌చార్జ్‌ల సమన్వయంతో గ్రామాల్లో పనిచేస్తారన్నారు.

అన్ని వర్గాలకూ సంక్షేమాన్ని అందించాం

- ఫ్యాన్ గుర్తుకు ఓటేసి ఆశీర్వదించండి
- కొత్తపేట ఎమ్మెల్యే అభ్యర్థి జగ్గిరెడ్డి సుడిగాలి ప్రచారం
- వైఎస్సార్ సీపీకి సంపూర్ణ మద్దతు



మూలస్థాన అగ్రహారంలో ప్రచార రథంపై నుంచి ప్రజలను ఉద్దేశించి ప్రసంగిస్తున్న ఎమ్మెల్యే జగ్గిరెడ్డి

ఆలమూరు: గత సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా ఇచ్చిన హామీలన్ని నిలబెట్టుకుని అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమాన్ని అందించి గ్రామాల అభివృద్ధికి విశేష తోడ్పాటు అందించామని కొత్తపేట ఎమ్మెల్యే అభ్యర్థి చిర్ల జగ్గిరెడ్డి అన్నారు. మండలంలోని బడుగువానిలంక, మడికి శివారు చిలకలపాడు, మూలస్థాన అగ్రహారం శివారు ఇందిరా కాలనీలో సోమవారం ఆయన నిర్వహించిన సుడిగాలి ప్రచారానికి అపూర్వ స్పందన లభించింది. పార్టీ మండల కన్వీనర్ తమ్మన శ్రీనివాసు, ఏఎంసీ చైర్మన్ యనమదల నాగేశ్వరరావు, సర్పంచ్‌లు దూలం వెంకటలక్ష్మి, ఉండ్రాసపు లక్ష్మీమానిక, గ్రామ కమిటీ అధ్యక్షుడు తోట శ్రీను ఆధ్వర్యంలో ఎమ్మెల్యే జగ్గిరెడ్డి ఇంటింటికీ వెళ్లి రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసిన పథకాలను వివరించారు. పేద, బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి సీఎం జగన్ చేసిన కృషిని తెలియజేశారు. నదీ తీర ప్రాంతంలోని బడుగువానిలంక, మడికి, చొప్పెల్ల తదితర గ్రామాల లంక భూములను రక్షించేందుకు రూ.43 కోట్లతో గ్రోయిన్లను నిర్మించిన సంగతిని ఆయన గుర్తు చేశారు. అలాగే రూ.కోట్లతో రహదారులను అభివృద్ధి చేసి డ్రైనేజీలను నిర్మించి ఎన్నడూ లేని విధంగా కాలనీలను అభివృద్ధి చేసిన వైఎస్సార్ సీపీకి తమ అమూల్యమైన ఓటును ఫ్యాన్ గుర్తుపై వేసి ఎంపీ అభ్యర్థిగా రాపాక వరప్రసాద్‌ను, ఎమ్మెల్యేగా తనను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు.



గోపాలపురంలో ఎమ్మెల్యే జగ్గిరెడ్డికి వినతిపత్రం సమర్పిస్తున్న బీకేఎస్ ప్రతినిధులు

రైతుకు భరోసా, ధీమా కల్పించింది జగన్ ప్రభుత్వమే..

కొత్తపేట: రాష్ట్రంలో వ్యవసాయ రంగ అభివృద్ధికి, రైతుల సంక్షేమానికి దేశ చరిత్రలోనే ఏ ప్రభుత్వం తీసుకోని నిర్ణయాలు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం తీసుకుని, ఒక భరోసా, ధీమా కల్పించిందని కొత్తపేట ఎమ్మెల్యే, అభ్యర్థి జగ్గిరెడ్డి అన్నారు. ప్రస్తుత అసెంబ్లీ, పార్లమెంటు సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో పోటీ చేస్తున్న ప్రధాన పార్టీల అభ్యర్థులకు రైతులకు సంబంధించిన పలు సమస్యలు పరిష్కరించాలని కోరుతూ భారతీయ కిసాన్ సంఘ్ (బీకేఎస్) ప్రతినిధులు వినతిపత్రాలు సమర్పించారు. దానిలో భాగంగా డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా బీకేఎస్ అధ్యక్షుడు యాళ్ల వెంకటానందం, సభ్యులు తిక్కిరెడ్డి గోపాలకృష్ణ, ముత్యాల జమ్మీలు, ఉప్పుగంటి భాస్కరరావు, మాకిరెడ్డి సత్తిబాబు, చేకూరి సూర్యనారాయణరాజు సోమవారం రావులపాలెం మండలం గోపాలపురంలో ఎమ్మెల్యే జగ్గిరెడ్డిని కలసి వినతి పత్రం సమర్పించారు. వారిచ్చిన అంశాలను పరిశీలించిన జగ్గిరెడ్డి సీఎం జగన్ దృష్టికి తీసుకువెళ్లి మళ్లీ ఏర్పడనున్న వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో పరిష్కరించేందుకు కృషి చేస్తానని అన్నారు.

వైఎస్సార్ సీపీ గెలుపునకు కృషి చేయాలి



కడలిలో మేనిఫెస్టో, నమూనా బ్యాలెట్ పత్రాలతో గొల్లపల్లి సూర్యారావు

రాజోలు: రానున్న ఎన్నికల్లో ఫ్యాను గుర్తుపై ఓట్లు వేసి, సీఎంగా మళ్లీ జగన్ మోహన్‌రెడ్డిని చేసుకోవాలని రాజోలు ఎమ్మెల్యే అభ్యర్థి గొల్లపల్లి సూర్యారావు అన్నారు. సోమవారం కడలిలో వాసంశెట్టి బుల్లియ్య ఆధ్వర్యంలో వైఎస్సార్ సీపీ కార్యకర్తల సమావేశం జరిగింది. సమావేశంలో గొల్లపల్లి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. అనంతరం గ్రామంలో ఇంటింటికీ ఎన్నికల ప్రచారం చేశారు. ఈవీఎం నమూనా బ్యాలెట్ పత్రాలతోను, మేనిఫెస్టోతోను ఆయన ఓటర్లు ఓట్లు అభ్యర్థించారు. సర్పంచ్ చొప్పల గురునాథ్, నాయకులు మేడిద శేషగిరి రావు, కంచర్ల శేఖర్, తాడి సంజీవరావు, బత్తుల శ్రీను పాల్గొన్నారు.

జగనన్నను గెలిపించాలి



గుడిమూల ఎన్నికల ప్రచారంలో నాయకులు, పార్టీ శ్రేణులు



ముంగండపాలెంలో ఎమ్మెల్యే అభ్యర్థి విప్పర్తి వేణుగోపాలరావును సత్కరిస్తున్న కుటుంబం

అయినవిల్లి: ఫ్యాన్ గుర్తుకు ఓటువేసి విప్పర్తి వేణుగోపాలరావును ఎమ్మెల్యేగా గెలిపించాలని, అలాగే సీఎంగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని గెలిపించాలని పి.గన్నవరం నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి వేణుగోపాలరావు సతీమణి అంజలి, ఆయన చిన్న కోడలు జెమీమాలు సోమవారం వీరవల్లిపాలెంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. వీరిని గెలిపించడం ద్వారా రాష్ట్రంలోను, నియోజకవర్గంలోని సమస్యలను పరిష్కరిస్తారన్నారు. అలాగే అభివృద్ధికి కృషి చేస్తారన్నారు. అలాగే సిరిపల్లిలో పార్టీ మండల శాఖ అధ్యక్షుడు కుడుపూడి విద్యాసాగర్ ఆధ్వర్యంలో జరిగిన ఎన్నికల ప్రచారంలో నేలపూడి స్టాలిన్‌బాబు పాల్గొన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రానికి సీఎం కావడంతో ప్రజలకు ఎంతో జరుగుతుందన్నారు.

సఖినేటిపల్లి: ఇంటింటికీ జగన్ కోసం సిద్ధం కార్యక్రమంలో భాగంగా సోమవారం బూత్ స్థాయి కమిటీల సభ్యులు ఎన్నికల ప్రచారం చేశారు. ఫ్యాన్ గుర్తుపై ఓట్లు వేసి గెలిపించాలని, మళ్లీ జగనన్నను సీఎం చేయండి అంటూ గడప గడపకు ఎన్నికల ప్రచారం చేశారు. గుడిమూలలో వైస్ ఎంపీపీ రుద్రరాజు చినరాజా, సర్పంచ్ దెందుకూరి శ్రీహరిరాజు, నాయకులు కోన ప్రభాకర్, బీనబోయిన ఏసుబాబు, అంతర్వేది పాలెంలో ఎంపీపీ వీరా మల్లిబాబు, నాయకులు కోనపల్లి వెంకటేశ్వరరావు, మందపాటి సత్యనారాయణ, సఖినేటిపల్లిలో సర్పంచ్ గొల్లమందల చిట్టిబాబు, వైస్ ఎంపీపీ రాపాక దీవెన కుమారి, ఎంపీటీసీ నల్లి రత్న కుమార్, నాయకులు, బూత్ స్థాయి కమిటీ సభ్యులు ఎన్నికల ప్రచారం చేశారు.

జగన్ పాలనకు అందరి మద్దతు

అంబాజీపేట: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో రాష్ట్రంలో ప్రజలందరూ మద్దతు తెలుపుతున్నారని వైఎస్సార్ సీపీ రాష్ట్ర ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి నేలపూడి స్టాలిన్‌బాబు, జిల్లా ప్రచార విభాగ అధ్యక్షుడు దొమ్మేటి సత్యమోహన్, ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు అన్నారు. అంబాజీపేట శివారు కొత్తపాలెంలో సోమవారం ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి విప్పర్తి వేణుగోపాలరావును, అమలాపురం ఎంపీ రాపాక వరప్రసాదరావులను రెండు ఓట్లు ఫ్యాన్ గుర్తుపై వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. మహిళలు మాట్లాడుతూ జగన్‌ని మరోసారి ముఖ్యమంత్రిని చేసేందుకు, ఎమ్మెల్యే అభ్యర్థి వేణుగోపాలరావును, ఎంపీ అభ్యర్థి రాపాకలకు తమ వంతు మద్దతు తెలిపి గెలుపునకు కృషి చేస్తామన్నారు.

వైఎస్సార్ సీపీ గెలిస్తేనే పథకాలు కొనసాగుతాయి

పి.గన్నవరం: వైఎస్సార్ సీపీ గెలిస్తేనే ప్రజా సంక్షేమ పథకాలు కొనసాగుతాయని పి.గన్నవరం నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి విప్పర్తి వేణుగోపాలరావు అన్నారు. మండలంలోని ముంగండ, ముంగండపాలెం గ్రామాల్లో సోమవారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే పాముల రాజేశ్వరీదేవి, మండల పార్టీ అధ్యక్షుడు నక్కా వెంకటేశ్వరరావు, నేలపూడి స్టాలిన్‌బాబు, సర్పంచ్‌లు శృంగవరపు లక్ష్మణరావు, కుసుమ చంద్రకళ తదితరులతో కలసి విప్పర్తి ఇంటింటికీ తిరిగి ఓటర్లను కలుసుకున్నారు. ఫ్యాన్ గుర్తుకు ఓట్లేసి ఎమ్మెల్యేగా తనను, ఎంపీగా రాపాక వరప్రసాదరావును గెలిపించాలని కోరారు. దేశంలో ఎక్కడా లేని విధంగా మన రాష్ట్రంలో సీఎం జగన్ ప్రజా సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారని వివరించారు. గత ఎన్నికల్లో ఇచ్చిన అన్ని హామీలను జగన్ అమలు చేశారన్నారు. ఇచ్చిన హామీలను కచ్చితంగా అమలుచేసే జగన్‌ను మళ్లీ ముఖ్యమంత్రిని చేయాలని కోరారు. మోసపూరిత హామీలతో వస్తున్న చంద్రబాబు నాయుడు, పవన్‌కల్యాణ్‌లను నమ్మవద్దని సూచించారు. ఎంపీటీసీలు యాండ్ర విజయలక్ష్మి, ముక్కామల భారతి, సొసైటీ చైర్మన్ బొడ్డు సురేష్, నాయకులు దేశిరాజు సీతారామయ్య, ఉలిశెట్టి బాబీ, సరెళ్ల అప్పారావు, కుడుపూడి నాగార్జున, కొప్పిశెట్టి వెంకన్న, జంగా చంద్రమౌళి, అప్పారి సాయి తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమానికి చిరునామా జగనన్న ప్రభుత్వం

కొత్తపేట: కుల, మత, పార్టీ రహితంగా అన్ని వర్గాల సంక్షేమ పథకాలకు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం చిరునామాగా నిలిచిందని ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ అసెంబ్లీ అభ్యర్థి చిర్ల జగ్గిరెడ్డి అన్నారు. కొత్తపేట శివారు చినరాముడునూతిమెరక గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు గుబ్బల దుర్గారావు, రాయుడు చిన్న, యనమదల నానిబాబు, రెడ్డి చంద్రశేఖర్, కేతా దుర్గాప్రసాద్ తదితరులు ఆ పార్టీకి రాజీనామా చేసి ఎన్నికల ప్రచారంలో ఉన్న ఎమ్మెల్యే జగ్గిరెడ్డిని కలిసి వైఎస్సార్ సీపీలో చేరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో పార్టీ రహితంగా సీఎం జగన్ అమలు చేసిన ప్రజా సంక్షేమ పథకాలు తాము కూడా పొందామని, ఆయన పాలన, నియోజకవర్గంలో ఎమ్మెల్యే జగ్గిరెడ్డి పనితీరు నచ్చి వైఎస్సార్ సీపీలో చేరామన్నారు. ఆయన విజయానికి కృషి చేస్తామని మాటిచ్చారు. దానికి ప్రతిగా జగ్గిరెడ్డి వారికి కృతజ్ఞతలు తెలియజేస్తూ వారికి పార్టీ కండువాలు వేసి సాదరంగా ఆహ్వానించారు.స్థానిక వైఎస్సా ర్ సీపీ బీసీ నాయకుడు గుత్తుల వాసు పాల్గొన్నారు.



బడుగువానిలంకలో వైఎస్సార్ సీపీలో చేరిన ప్రతిపక్ష కార్యకర్తలను ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే జగ్గిరెడ్డి

ఆలమూరు: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే రాష్ట్ర ప్రగతి, సంక్షేమాభివృద్ధి సాధ్యమని భావిస్తూ అనునిత్యం వైఎస్సార్ సీపీలో చేరుతూ సార్వత్రిక ఎన్నికల్లో గెలుపునకు విశేష కృషి చేస్తున్న నియోజకవర్గ ప్రజల ఆదరణ మరువలేనిదని కొత్తపేట ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి వ్యాఖ్యానించారు. మండలంలోని బడుగువానిలంకలో సర్పంచ్ దూలం వెంకటలక్ష్మి, పీఏసీఎస్ అధ్యక్షుడు వీరా రాజు, పార్టీ నేత దూలం సత్తిబాబు ఆధ్వర్యంలో సోమవారం ఎన్నికల ప్రచారం జరిగింది. ఆయా గ్రామాల్లో టీడీపీ, జనసేన పార్టీలకు చెందిన సుమారు 200 మంది కార్యకర్తలు స్థానిక ఎమ్మెల్యే జగ్గిరెడ్డి సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరారు. వారందరికి ఎమ్మెల్యే జగ్గిరెడ్డి కండువా వేసి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. వైఎస్సార్‌సీపీ మరోసారి అధికారం చేపట్టిన వెంటనే పార్టీ శ్రేణులకు సముచిత స్థానం కల్పిస్తామని హామీ ఇచ్చారు. వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ తమ్మన శ్రీనివాసు, ఎంపీపీ తోరాటి లక్ష్మణరావు, జెడ్పీటీసీ తోరాటి సీతామహాలక్ష్మి, ఏఎంసీ చైర్మన్ యనమదల నాగేశ్వరరావు, రాష్ట్ర యూత్ కార్యదర్శి దియ్యన పెదకాపు, వనుం జార్జిబాబు తదితరులు పాల్గొన్నారు.

చరిత్ర హీనుడు చంద్రబాబు

వైఎస్సార్ సీపీ రాజోలు అభ్యర్థి గొల్లపల్లి

మామిడికుదురు: చంద్రబాబు చరిత్ర హీనుడని రాజోలు నియోజకవర్గం వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి గొల్లపల్లి సూర్యారావు పేర్కొన్నారు. ఆయన మామిడికుదురులో సోమవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ఫ్యాను గుర్తుకు ఓట్లు వేసి వైఎస్సార్ సీపీ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. ఇచ్చిన ప్రతి హామీని అమలు చేసే నేత సీఎం వైఎస్ జగన్ అయితే ఇచ్చిన ప్రతి హామీని ఎగ్గొట్టే నేత చంద్రబాబు అని తీవ్రంగా మండిపడ్డారు. జగన్‌కు చంద్రబాబుకు పోలికే లేదన్నారు. ఎన్నో ఆటుపోట్లను ఎదుర్కొని, కుట్రలను ఛేదించుకుని జగన్ వైఎస్సార్ సీపీని అధికారంలోకి తీసుకు వచ్చారన్నారు. చంద్రబాబు కుట్రలను ప్రజలు గమనిస్తున్నారని, ఎన్నికల్లో తగిన గుణపాఠం చెబుతారని సూర్యారావు చెప్పారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ జిల్లా గ్రీవెన్స్ సెల్ అధ్యక్షుడు కటకంశెట్టి ఆదిత్య, కంచి శ్రీరామ్, నయినాల రామకృష్ణ, వర్ధినేని రాము, గెడ్డం రాంబాబు, మొల్లేటి సత్యనారాయణ, నయినాల కన్న, కొల్లాబత్తుల మున్నా, కట్టా హరీష్, రాజ్ మొహిద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

గొల్లపల్లికి వడదెబ్బ

మలికిపురం: వైఎస్సార్ సీపీ రాజోలు అభ్యర్థి గొల్లపల్లి సూర్యారావు సోమవారం వడదెబ్బకు గురయ్యారు. లక్కవరం ఎన్నికల ప్రచారం నుంచి మలికిపురం వస్తున్న ఆయన తీవ్ర అస్వస్థతకు గురవడంతో వెంటనే మలికిపురంలోని మెడ్‌ప్లస్ ఎమర్జెన్సీ ఆసుపత్రికి తరలించారు. ఆయన చికిత్స పొందుతున్నారని పార్టీ రాష్ట్ర లీగల్ సెల్ కార్యదర్శి మంగెన సింహాద్రి తెలిపారు.



మామిడికుదురులో ఎన్నికల ప్రచారంలో రాజోలు అభ్యర్థి గొల్లపల్లి సూర్యారావు

జగన్ సీఎం అయితేనే ఇంటింటికీ సంక్షేమం

రాష్ట్రానికి మరోసారి ముఖ్యమంత్రిగా జగన్ అయితేనే ప్రజలకు ఇంటింటికీ సంక్షేమ పథకాలు అందుతాయని రాజోలు వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి గొల్లపల్లి సూర్యారావు అన్నారు. సోమవారం మండలంలోని లక్కవరంలో ఇంటింటికీ వైఎస్సార్ సీపీ ప్రచారం నిర్వహించారు. ప్రజల వద్దకు వెళ్లిన సూర్యారావు నవరత్నాల మేనిఫెస్టో కర పత్రాలను అందించారు. జగన్‌కు ఓటు వేయాల్సిన ఆవశ్యకతను వివరించారు. ప్రతి పక్షాల బూటకపు హామీలు నమ్మవద్దని సూచించారు. కూటమి వస్తే రాష్ట్రంలో సంక్షేమం ఉండదని అన్నారు. కార్యక్రమంలో సరెళ్ల విజయ ప్రసాద్, మంగెన సింహాద్రి, కొడవటి దొరబాబు, జాషువా, ఉలిశెట్టి లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

కాపు సామాజికవర్గానికి జగన్ చేయూత

రాజోలు: రాష్ట్రంలో కాపు సామాజిక వర్గానికి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎనలేని చేయూత ఇచ్చారని వైఎస్సార్ సీపీ రాజోలు ఎమ్మెల్యే అభ్యర్థి గొల్లపల్లి సూర్యారావు, అమలాపురం ఎంపీ అభ్యర్థి రాపాక వరప్రసాదరావు అన్నారు. సోమవారం శివకోడు మంగెన గంగయ్య కాపు కల్యాణ మండపంలో రాజోలు నియోజకవర్గ వైఎస్సార్ సీపీ కాపు ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఇందులో అభ్యర్థులు గొల్లపల్లి, రాపాకలను కాపు నేతలు శాలువాలతో సత్కరించారు. జనసేన, టీడీపీ నుంచి 20 మంది కాపు సోదరులు వైఎస్సార్ సీపీలో చేరారు. వీరికి గొల్లపల్లి పార్టీ కండువాలను సాదరంగా ఆహ్వానించారు. అనంతరం వారిరువురు మాట్లాడుతూ, రాజకీయంగా రాష్ట్రంలోని కాపు సామాజికవర్గానికి తగిన గుర్తింపు ఇచ్చే విధంగా సీఎం జగన్ కృషి చేశారన్నారు. రానున్న ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తులపై తమ ఇరువురికి ఓట్లు వేసి గెలిపించాలని గొల్లపల్లి, రాపాక కోరారు. ఎంపీపీ వీరా మల్లిబాబు, మలికిపురం మండల పార్టీ అధ్యక్షుడు అడబాల బ్రహ్మాజీ, లీగల్‌సెల్ కార్యదర్శి మంగెన సింహాద్రి, కటకంశెట్టి ఆదిత్య, సూరిశెట్టి బాబీ, ముత్యాల కాశీ, తులా సత్యనారాయణ, ఇంటిపల్లి బుజ్జి, బండారు కాశీ, అత్యధిక సంఖ్యలో నియోజకవర్గంలోని కాపులు, మహిళలు పాల్గొన్నారు.



శివకోడులో ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులు గొల్లపల్లి, రాపాకలను సత్కరిస్తున్న కాపు నేతలు